క్లుప్తంగా

నియామకం



ములుగు రూరల్: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (పీఈటీఏ)అధ్యక్షుడిగా ములుగు డిగ్రీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జాటోతు సోమన్న ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం సోమన్నను శాలువాలతో సన్మానించారు. యూనివర్సిటీ పరిధిలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాజేడు వైద్యాధికారి మధుకర్ విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

108 వాహనం తనిఖీ



మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 108 అంబులెన్స్ వాహనాన్ని 108 ప్రోగ్రాం మేనేజర్ నసీరూదీన్, జిల్లా అధికారి రాజునాయ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలోని మెడిసిన్స్, మెడికల్ ఎక్విప్మెంట్స్, రికార్డులను పరిశీలించి వర్కింగ్ కండిషన్ చెక్ చేశారు. అలాగే అంబులెన్స్ సేవలపై డాక్టర్ వినయ్‌భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు మెడిసిన్స్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. 108కి ఫోన్ రాగానే మండల ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఈఎంటీ మహేష్, పైలెట్ సంపత్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



చిట్యాల: మండలంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న నాయకులకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మూడేళ్ల క్రితమే బస్టాండ్ నిర్మాణం పూర్తి అయిన ఇంత వరకు ప్రారంభించకపోవడం ఎంటనీ ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్స్ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి అజయ్, కౌశిక్, శేషివర్ధన్, అభిరామ్, గణేష్, హేమంత్, జయప్రకాశ్, వినయ్, సూరజ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి: కొర్కిశాల మోడల్‌స్కూల్‌లో గంటల ప్రతిపాదికన కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు పీజీటీ కెమిస్ట్రీ పోస్టుకు బీఈడీ అర్హత ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా జిరాక్స్ పత్రాలతో 17న పాఠశాలలో నిర్వహించే డెమో క్లాస్‌కు, ఇంటర్వ్యూకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

పరామర్శ

మల్హర్: మండలంలోని రుద్రారంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు అప్పాల కొమురయ్య వెన్నెముకకు సంబంధించిన శస్త్రచికిత్స చేసుకున్నాడు. దీంతో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం కొమురయ్యను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు నారాయణ, బుడిగే వెంకటేశ్, కొమ్మర లక్ష్మణ్, వెంకటచారి, సత్యనారాయణ, పెద్ద లింగయ్య, సంపత్, వెంకటస్వామి, రవి, సతీష్, రాము పాల్గొన్నారు.

వామ్మో.. వానరం

- కోతుల బీభత్సంతో గ్రామస్తుల సతమతం
- ఆందోళనలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు
- వారం రోజుల్లో 20 మందిపై దాడి
- రక్షణ కావాలంటూ అధికారులకు మొరపెట్టుకుంటున్న మహిళలు
- స్పందించకుంటే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిక



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు



ఓ ఇంటిగోడపై గుంపులుగా కూర్చున్న కోతులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలో కోతులు విపరీతంగా పెరిగాయి. ప్రజలు కోతుల దాడులతో భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ వీధుల్లో, ఇళ్లపై, చెట్లపై ఉంటూ మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధుల పై దాడి చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఇళ్లలోకి, ఆవరణలోకి దూరి బీభత్సం సృష్టిస్తున్నాయి. వారం రోజుల్లోనే 20 మందికి పైగా గాయపరచడంతో వారు చికిత్స పొందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయి.

అధికారులకు వినతి..

గతంలో గోవిందరావుపేట గ్రామంలోని మహిళలు జిల్లా అధికారులను కలిసి మొరపెట్టుకున్న, పలుసార్లు వినతి పత్రాలను అందజేసినా ఫలితం కనిపించకపోవడంతో సోమవారం గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో వెళ్లి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ సృజన్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మహిళలు అధిక సంఖ్యలో వెళ్లి కలెక్టర్‌ను కలవగా ఫారెస్ట్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కోతులను నిజామాబాద్ తరలించి ఆపరేషన్ చేయించాలంటే గ్రామస్తులే ఖర్చు భరించాలని ఫారెస్ట్ అధికారి చెప్పడంతో ప్రజలు వెనుకడుగువేశారు. ఊరి తరఫున చందాలు వేసుకొని బోనులు చేయించి, కొన్ని కోతులను పట్టి అడవిలో వదిలేశారు. కానీ, అవి మళ్లీ ఊరిలోకే వచ్చాయి.

ఎన్నికలు బహిష్కరిస్తాం..

అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి కోతుల బాధ తీర్చాలని లేదంటే రాబోయే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని మహిళలు హెచ్చరిస్తున్నారు. కోతుల నుండి రక్షణ కల్పించకపోతే ఓటు అడగడానికి గ్రామంలోకి ఎవరూ రావొద్దంటూ మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కోతుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ

రోజుకో ప్రమాదం ఎదుర్కొంటున్నాం



కోతులు చేసే దాడుల నుంచి రోజుకో ప్రమాదం ఎదుర్కొంటూ బతుకుతున్నాం. పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇంత పెద్ద సమస్యతో మేమందరం సతమతమవుతుంటే ఒక్క అధికారి, ఒక్క ప్రజా ప్రతినిధి కూడా పట్టించుకోకపోవడం చాలా బాధాకరం. ఇలాంటి పరిస్థితుల్లో మేమెందుకు ఓటు వేయాలి. మాకు శాశ్వత పరిష్కారం చూపండి.

– యార్లగడ్డ అరుణ, గృహిణి, గోవిందరావుపేట

రోడ్డుభద్రతా నియమాలు పాటించాలి

- మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న వినోద్‌రెడ్డి

ములుగు రూరల్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీఏ కార్యాలయంలో వాహనదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణిస్తున్నారని అందుకు కారణం హెల్మెట్ వాడకపోవడమేనని అన్నారు. వాహనం నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడకూడదని తెలిపారు. తప్పనిసరి అయితే వాహనం రోడ్డుకు ఎడమ వైపు ఆపి మాట్లాడాలని అన్నారు. హెల్మెట్ వినియోగంతో రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యానికి మేలు

- సీడీపీఓ మల్లీశ్వరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ మల్లీశ్వరి

ఎస్ఎస్‌తాడ్వాయి: పౌష్టికాహారంతోనే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిలో తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ టీచర్లకు పోషణ మాసోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్లన తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా హాజరై పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు, పాలు, పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుమతి, విజయ, శారద, అరుణ, భాగ్యలక్ష్మి, బ్లాక్ కోఆర్డినేటర్ శ్రావణి, యూడీసీ రఘువీర్, జూనియర్ అసిస్టెంట్ శిరీష, ఎస్‌జీఓ బండారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తెగుళ్లు సోకిన వరి పంటల పరిశీలన

సాక్షి స్పందన



వరిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏఓ వేణుగోపాల్

మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లో తెగుళ్లు, వైరస్ సోకిన వరి పంట పొలాలను మండల ఇన్‌చార్జ్ ఏఓ వేణుగోపాల్, ఏఈఓ మహేష్ రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలో కంకి దశలో ఉన్న వరి పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకడంతో వాటి నివారణకోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 12న వరి పంటకు వైరస్ అనే కథనంతో సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. దీంతో స్పందించిన వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా వరి పంటలో తెగుళ్లు, ఆకుచుట్టు పురుగు, ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆకు ఎండు తెగులు నివారణకు పూతదశలో ఉన్న పొలాలకు ప్లాంటోమైసిన్ లేదా పోషామైశిన్ ఎకరాకు 100 గ్రాములు, పూతలేని పొలాలకు ప్లాంటోమైసిన్, కాపర్ ఆక్సీ క్లోరైడ్ 03 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుచుట్టు పురుగు నివారణకు క్లోరంతనీలిప్రోల్ లీటర్ నీటికి 0.3 ఎంఎల్, మెక్టిన్ బెంజోయేట్ ఎకరాకు 100 గ్రాములు, సుడిదోమ నివారణకు డైనోటెఫ్యూరాన్ లీటర్ నీటికి 04 గ్రాములు లేదా పైమెట్రోజోన్, కంకనల్లి నివారణకు స్పైరోమేసిఫిన్ 01 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కల్వర్టు తాత్కాలిక మరమ్మతు పనులు పూర్తి

- తప్పిన రవాణా తిప్పలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కూలిన కల్వర్టు స్థానంలో మోరీలను ఏర్పాటు చేస్తున్న అధికారులు, సిబ్బంది



రోడ్డును చదునుచేస్తున్న జేసీబీ

మంగపేట: మండలంలోని తిమ్మంపేట నుంచి నీలాద్రిపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుపై కూలిన స్లాబ్ కల్వర్టు వద్ద తాత్కాలిక మరమ్మతులు మంగళవారం సాయంత్రం పూర్తయ్యాయి. సాయంత్రం 05 గంటల నుంచి రోడ్డుపై రాకపోకలు పునఃప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఇబ్బందులు తొలిగిపోయాయి. తిమ్మంపేట బీసీ కాలనీ సమీపంలోని దాముల ఒర్రెపై నిర్మించిన స్లాబ్ కల్వర్టు కూలిపోవడంతో తిమ్మంపేట పంచాయతీ పరిధిలోని అబ్బాయిగూడెం, బాలన్నగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని నీలాద్రిపేట, ప్రాజెక్టునగర్ గొత్తికోయగూడేలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిన విషయం విదితమే. వెంటనే స్పందించిన పంచాయతీరాజ్ డీఈ నరేష్‌బాబు, ఏఈ వినీత్, సూపర్ వైజర్ రమణాకర్ కూలిన కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించి 24 గంటల్లో మోరీలను ఏర్పాటు చేసి తాత్కాలికంగా మరమ్మతులు పూర్తి చేశారు. సకాలంలో మరమ్మతులు పూర్తి చేసి ఇబ్బందులు తొలిగించిన అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ వర్కర్ కుటుంబాన్ని ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

ములుగు రూరల్: ఎదిర పీహెచ్‌సీ పరిధిలో లక్ష్మీపురం ఆశ వర్కర్ లక్ష్మి బండ్లవాగు దాటుతూ ప్రమాదవశాత్తు వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందిందని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని ఆశల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నం నీలాదేవి కోరారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మరణించిన ఆశా వర్కర్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఆశాలకు పారితోషికం పద్ధతిని తొలగించి వేతనం ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో రత్నం రాజేందర్, స్వరూప పాల్గొన్నారు.

ఇదీ రోడ్డేనట !



ఇదేంటి కాల్వ ఉంటే రోడ్డు అంటున్నారని అయోమయానికి గురికాకండి.. నిజంగా ఇది రోడ్డేనట. వెంకటాపురం మండల పరిధిలోని శివాపురం బజారు సమ్మక్క, సారలమ్మ గుడి సమీపంలోని రోడ్డు ఇలా కాల్వను తలపిస్తుంది. రోడ్డు పక్కన డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థనీటికి తోడు వాన నీరంతా రోడ్డుపైనే నిలుస్తుంది. దీంతో రాత్రి పూట కాదు కదా.. కనీసం పగలు సైతం ఆ దారిలో వెళ్లలేని దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ రాలేని విధంగా మారిన రోడ్డును అధికారులు బాగు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

– వెంకటాపురం(కె)

గ్రామాల్లో మత్తుపదార్థాలను ప్రోత్సహించొద్దు

- కాటారం డీఎస్పీ సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

కాళేశ్వరం: గ్రామాల్లో మత్తుపదార్థాలైన గుడుంబా, గంజాయి, గుట్కాలను ప్రోత్సహించొద్దని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మహదేవపూర్ మండలం ఎడపల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్‌ను మహదేవపూర్ సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు చేసి నంబర్ ప్లేటు లేని 3 వాహనాలను గుర్తించి వాటికి జరిమానా విధించారు. అనంతరం గ్రామంలో సెంటర్ వద్ద గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. మత్తు పదార్థాలు విక్రయించినా.. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. గ్రామంలోకి కొత్తవారు వస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామంలో పది లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ 2 ఎస్సై శశాంక్, పలిమెల, కాళేశ్వరం ఎస్సైలు రమేష్, తమాషారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలి

- డీపీఓ శ్రీలత



పనులను పరిశీలిస్తున్న డీపీఓ శ్రీలత

కాటారం: గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించి ఎలాంటి అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత సూచించారు. మండలంలోని గంగారం గ్రామ పంచాయతీని మంగళవారం ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి నిధులు, ఖర్చు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించి పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్‌కు పలు సూచనలు చేశారు. పల్లె ప్రగతి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పల్లెప్రగతి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవడంతో పాటు తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పశువుల ఆస్పత్రి మధ్యాహ్నమే బంద్

- సమయపాలన పాటించని వైద్యులు



తాళం వేసిన ఆస్పత్రి గేటుకు కట్టేసిన ఎడ్లు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. అదే గ్రామానికి చెందిన తుంగల గోవర్ధన్ అనే రైతు రెండు ఎడ్లను తీసుకొని మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు వెళ్లాడు. కానీ అక్కడ వైద్యులు, సిబ్బంది లేరు. ఆస్పత్రికి తాళం వేసి ఉంది. పశువైద్యులకు ఫోన్ చేసిన స్పందించలేదని రైతు తెలిపాడు. దీంతో కొంతసేపు వరకు ఆ రెండు ఎడ్లను గేటుకు కట్టేసి నిరసన వ్యక్తం చేశాడు. పది రోజుల కిందట తన ఎడ్లకు జబ్బు చేసిన మందులు కూడా బయట తీసుకో అని చిట్టి రాసి ఇచ్చినట్లు రైతు పేర్కొన్నాడు. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని పశువులకు వైద్యం అందేలాగా దృష్టిసారించాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి రాజబాబును ఫోన్‌లో సంప్రదించగా మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు భోజన విరామ సమయం అని, తనతో పాటు సిబ్బంది జిల్లా కేంద్రంలో సమావేశంలో ఉన్నారని తెలిపారు. అటెండర్లు విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటినుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం నేడు(మంగళవారం) నుంచి నవంబర్ 14 వరకు నిర్వహించబడుతుందని మహదేవపూర్ పశు ఆస్పత్రి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.రాజబాపు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎద్దులు, ఆవులు, గేదెలకు గాలికంటూ వ్యాధి నివారణ టీకా ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. తెలిపారు. రైతులు తమ గ్రామాలకు సంబంధించిన తేదీల్లో పశువులకు టీకా వేయించాలని కోరారు. టీకా నిర్వాహకులు కాళేశ్వరం క్లస్టర్, జూనియర్ వెటర్నరీ అధికారి తిరుపతి 89199 41484, మహదేవపూర్ క్లస్టర్ వెటర్నరీ అసిస్టెంట్ కె.నాగభూషణం ఫోన్ నంబర్ 94415 58754, సూరారం క్లస్టర్ గోపాలమిత్ర రాజబాబు ఫోన్ నంబర్ 93811 10469, పర్యవేక్షకులు డా.బీ.రాజబాపు, వెటర్నరీ వైద్యుడు 91212 13145 ఫోన్ నంబర్లను సంప్రదించి గ్రామాల టీకా షెడ్యూల్ వివరాలు తెలుసుకోవాలని తెలిపారు.

కాటారం: రైతులు, పశుపోషకులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(బుధవారం) నుంచి నవంబర్ 14 వరకు నెల రోజుల పాటు ఆవు, గేదెలకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు, పశుపోషకులు గ్రామానికి వచ్చిన పశువైద్య సిబ్బందికి సహకరించి ఆవులకు, గేదెలకు టీకాలు వేయించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతుగల్లు వాగు నుంచి ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా బద్దంపల్లి గ్రామానికి చెందిన యాళ్ల కిరణ్, సామల నిరంజన్‌రెడ్డి, బద్దం జైపాల్‌రెడ్డి, యాళ్ల చిరంజీవిలు సొంత ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పోలీసులు ముల్కలపల్లి శివారులో పట్టుకొన్నారు. వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు.

పాఠశాల విద్యార్థులకు దుస్తుల పంపిణీ

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎంఈఓ కోడేపాక రఘుపతి చేతుల మీదుగా మంగళవారం స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు, ఉపాధ్యాయుల ద్వారా సేకరించిన విరాళాలతో విద్యార్థులకు రూ.60వేలు విలువైన దుస్తులను కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు బోమ్మ రాజమౌళి, కూచనపెల్లి శ్రీనివాస్, బుర్ర సదయ్య, రాంనారాయణ, గడ్డం శంకర్, పీడీ సూదం సాంబమూర్తి, ఉస్మాన్‌అలీ, నీలిమారెడ్డి, సరళదేవి, విజయలక్ష్మీ, కల్పన, సుజాత, మూనిక, బుజ్జమ్మ, దాతలు మస్తందర్‌రెడ్డి, దేవ వీరన్న బోమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 42 మందికి మంజూరైన 13,58,000 లక్షల విలువైన చెక్కులను మంగళవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లినవారికి చేయూత ఇచ్చేందుకు సీఎంఆర్‌ఎఫ్ వరంలా మారిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఎంపీడీఓ దైవాధీనం, కాంగ్రెస్ నాయకులు మధుకర్‌రెడ్డి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గురుకులం ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి సురేష్

కొత్తగూడ: మండలంలోని పోలారం కస్తూర్బా గురుకుల జూనియర్ కళాశాలను మంగళవారం మండల ప్రత్యేకాధికారి సురేష్ ఆకస్మింగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, తరగతి గదులు, స్టాక్ రూం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం భోజనం అందుతుందా.. లేదా.. తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కళాశాల ఎస్వో సౌమ్య రికార్డులను చూపించారు.